క్లుప్తంగా

రుద్రభూమి అభివృద్ధికి రూ. 5లక్షల విరాళం



రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం నిడమానూరులోని విశ్వబ్రాహ్మణ రుద్రభూమి అభివృద్ధికి మాజీ సర్పంచ్ పరిమి రమేష్ కుటుంబ సభ్యులు రూ. 5లక్షల విరాళాన్ని మంగళవారం కమిటీ సభ్యులకు అందజేశారు. రుద్రభూమి అభివృద్ధికి నోచుకోకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని రమేష్ కుమారుడు, వైఎస్సార్ సీపీ గ్రామ కన్వీనర్ పరిమి వంశీ, కోడలు, మహిళా నాయకురాలు పరిమి సింధూర దృష్టికి కమిటీ సభ్యులు తీసుకెళ్లారు. దీంతో వారు స్పందించి రుద్రభూమి విస్తరణ, పునరుద్ధరణ, మౌలిక వసతుల ఏర్పాటుకు చెక్కును అందజేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శీలం రంగారావు, కమిటీ సభ్యులు హరి, చక్రవర్తి, రవి, శ్రీనివాస్, నాగభూషణం, కిరణ్, బ్రహ్మ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఏఈ జయరాజుకు ఘన సత్కారం



హనుమాన్‌జంక్షన్ రూరల్: విధి నిర్వహణలో చిత్తశుద్ధి, అంకితభావంతో సేవలు అందించిన ప్రభుత్వ ఉద్యోగులను ప్రజలు ఎప్పటికీ మర్చిపోలేరని పలువురు వక్తలు పేర్కొన్నారు. బాపులపాడు మండల పంచాయతీరాజ్ ఏఈ దోమ జయరాజు ఉద్యోగ విరమణ పురస్కరించుకుని మంగళవారం స్థానిక విజయవాడరోడ్డులో కాకాని భవన్ ఘనంగా వీడ్కోలు సభ నిర్వహించారు. పలువురు అధికారులు, ప్రజా ప్రతినిధులు, కాంట్రాక్టర్లు జయరాజు దంపతులను సత్కరించారు. సుదీర్ఘకాలం పాటు పంచాయతీరాజ్ శాఖలో ఇంజినీర్‌గా ఆయన అందించిన సేవలను కొనియాడారు.

విద్యుత్ శాఖ ఎస్ఈగా కృష్ణనాయక్



ఉయ్యూరు: విద్యుత్ శాఖ ఉయ్యూరు ఈఈ డి.కృష్ణనాయక్ ఎస్ఈగా పదోన్నతి పొందారు. ప్రభుత్వం ఆయన్ను విజయవాడ కార్పొరేట్ ఆఫీస్ కార్యాలయానికి జనరల్ మేనేజర్‌గా నియమిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. పదోన్నతి పొందిన కృష్ణనాయక్‌ను పలువురు విద్యుత్‌శాఖ అధికారులు, సిబ్బంది, వినియోగదారులు అభినందించారు.

కట్టుదిట్టం చేసినా ఆగని వీఐపీ దర్శనాలు

ఆలయ పరిసరాల పరిస్థితిపై ఈఓ ఆగ్రహం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మ దర్శనానికి క్యూలైన్లలో రద్దీ సాధారణంగా ఉన్నప్పటికీ అందరూ వీఐపీ దర్శనాలకే మొగ్గు చూపడంతో ఆలయ ప్రాంగణంలో గందరగోళ పరిస్థితి నెలకొంది. మంగళవారం మధ్యాహ్నం వీఐపీ టైం శ్లాట్‌కు గంట ముందు నుంచే వీఐపీల తాకిడి మొదలైంది. ప్రభుత్వానికి చెందిన వివిధ శాఖల అధికారులు, వారి కుటుంబ సభ్యులు అమ్మవారి దర్శనానికి ఇంద్రకీలాద్రికి తరలివచ్చారు. కాగా ఆ సమయంలో రూ.300, రూ.100 టికెట్లతో పాటు ప్రత్యేక క్యూలైన్లు ఖాళీగానే ఉన్నాయి. అయితే వీఐపీల పేరిట విచ్చేసిన వారందరూ గాలిగోపురం, సీఎం గేటులో నుంచే దర్శనం కోసం బారులు తీరారు. అదే సమయంలో ఆలయ ఈఓ శీనా నాయక్ పరిస్థితిని సీసీ కెమెరాల్లో గమనించారు. గాలిగోపురం వద్దకు చేరుకున్న ఈఓ సెక్యూరిటీ, పోలీసు సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అందరినీ వీఐపీ, సీఎం గేటు ద్వారా దర్శనానికి పంపవద్దని హెచ్చరించారు. దీంతో లక్ష్మీగణపతి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఫుట్ ఓవర్ బ్రిడ్జి వద్దే భక్తులను పోలీసులు నిలిపివేశారు. సుమారు మూడు గంటల పాటు ఎవరినీ అనుమతించకపోవడంతో భక్తులు గుంపులు గుంపులుగా చేరిపోయారు. మరో వైపు సింహం విగ్రహాల గేట్ల వద్ద భక్తులు తోపులాటకు గురై మహిళలు, చంటి పిల్లలు కేకలు వేయడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు.

దుర్గాదేవీ.. పాహిమాం

వైభవంగా దుర్గాష్టమి వేడుకలు

పెనమలూరు: శ్రీదేవి శరన్నవరాత్రుల మహోత్సవాల్లో భాగంగా మంగళవారం ఆలయాల్లో దుర్గాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. తొమ్మిదవ రోజు అమ్మవారిని శ్రీదుర్గాదేవిగా పూజించారు. యనమలకుదురు శ్రీకనకదుర్గమ్మ ఆలయం, చోడవరం నాగేంద్రస్వామి ఆలయం, పెదపులిపాక విజయరాజరాజేశ్వరి ఆలయం, పోరంకి షిర్డీ సాయిబాబా మందిరంలో అమ్మవారిని శ్రీదుర్గాదేవిగా అలంకరించారు. యనమలకుదురులోని రామలింగేశ్వరస్వామి ఆలయంలో పార్వతీదేవిని శ్రీ సిద్ధిధాత్రిదేవిగా అలంకరించారు. అమ్మవారికి విశేషంగా అర్చనలు చేసి, చండీహోమం నిర్వహించారు.

గన్నవరం: స్థానిక పాతగన్నవరంలోని శ్రీలక్ష్మీతిరుపతమ్మ ఆలయంలో మంగళవారం అమ్మవారిని దుర్గాదేవిగా అలంకరించి పూజలు నిర్వహించారు. అలాగే స్థానిక సొసైటీపేటలోని శ్రీగాయత్రి అమ్మవారి మందిరంలో నవదుర్గ, రుద్ర హోమాలు నిర్వహించారు. దావాజీగూడెంలోని శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో దుర్గాదేవి అమ్మవారి సన్నిధిలో కుంకుమార్చనలు జరిగాయి. స్థానిక శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం, యాదవులపేట రామాలయం, శ్రీకనకదుర్గమ్మ ఆలయాల్లో ఉత్సవాలు కొనసాగుతున్నాయి.



యనమలకుదురులో సిద్ధిదాత్రిదేవిగా పార్వతీదేవి అమ్మవారు



గన్నవరంలో దుర్గాదేవిగా లక్ష్మీతిరుపతమ్మ తల్లి

శ్రీ దుర్గాదేవిగా పేరంటాలమ్మ



దుర్గాదేవిగా దర్శనమిస్తున్న పేరంటాలమ్మ

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం రామవరప్పాడు శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో మంగళవారం అమ్మవారు దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో ముగ్గురమ్మలను దర్శించుకున్నారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో సామూహిక కుంకుమార్చన జరిగింది. అనంతరం ప్రదర్శించిన కూచిపూడి నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది.

గన్నవరం రూరల్: నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని గ్రామాల్లో మంగళవారం దుర్గాదేవిగా అమ్మవారిని అలంకరించి పూజలు చేశారు. గోపవరపుగూడెం రామాలయంలో అమ్మవారిని దుర్గాదేవిగా భక్తులు దర్శించారు.

దుర్గాదేవి.. నమోస్తుతే

ఉయ్యూరు: నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం అమ్మవారు దుర్గాదేవిగా దర్శనమిచ్చారు. ఉయ్యూరు శివాలయం, విజయ దుర్గాభవానీ దేవి ఆలయం, పెద ఓగిరాల శివాలయం, గండికుంట దత్త దేవాలయం, చిన ఓగిరాల, రాయల్ వంశీస్, కడవకొల్లు, కాటూరు గ్రామాల్లో దుర్గాదేవిగా దర్శనమిచ్చిన అమ్మవారికి భక్తులు విశేష పూజలు చేశారు. దత్త దేవాలయంలో చండీహోమం నిర్వహించారు.

కంకిపాడు: దేవీ శరన్నవరాత్రుల్లో భాగంగా తొమ్మిదో రోజు మంగళవారం అమ్మవారు దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. కంకిపాడు, ప్రొద్దుటూరు, ఈడుపుగల్లు, మద్దూరు, మంతెన, ఈడుపుగల్లు, ఉప్పలూరు గ్రామాల్లో విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు సామూహిక కుంకుమపూజలు చేశారు.

భక్తిశ్రద్ధలతో దీపాల ప్రదర్శన

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం ఎనికేపాడు శ్రీ గంగానమ్మ తల్లి దేవస్థానంలో దసరా ఉత్సవాలను పురస్కరించుకుని దుర్గాదేవిగా అమ్మవారు దర్శనమిచ్చారు. చిన్నారులు, భక్తులు భక్తిశ్రద్ధలతో దీపాలు ప్రదర్శించారు. ఆలయం వద్ద ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. వైఎస్సార్ సీపీ నాయకుడు రాచమళ్ల శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యులు రాచమళ్ల రత్నకుమారి పీటలపై కూర్చుని పూజలు చేశారు.

నున్నలో..



నున్నలో పూజలు చేస్తున్న డెప్యూటీ మేయర్ శైలజ

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలోని శ్రీకనకదుర్గమ్మ ఆలయంలో మంగళవారం అమ్మవారు శ్రీదుర్గాదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. విజయవాడ డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ దుర్గాదేవిని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ గుంటక సంధ్యారాణి, ఉపాధ్యక్షుడు ఆర్.రామారావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. అలాగే శ్రీ విశ్వేశ్వర స్వామి ఆలయం, సాయిబాబా మందిరం, చిన కంచిలో శ్రీకామాక్షి అమ్మవారు దుర్గాదేవి అలంకరణలో పూజలందుకున్నారు. పి.నైనవరం, అంబాపురంలో అమ్మవారు దుర్గాదేవిగా దర్శనమిచ్చారు.



దుర్గాదేవిగా విజయదుర్గాభవానీ



మద్దూరులో దుర్గాదేవి అలంకరణ



కంకిపాడు శివాలయంలో దుర్గాదేవిగా అమ్మవారు



ఎనికేపాడులో అమ్మవారికి దీపాలు తీసుకొచ్చిన్న చిన్నారులు

'డిజిటల్ బుక్' పోస్టర్ ఆవిష్కరణ



డిజటల్ బుక్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న అవుతు శ్రీనివాసరెడ్డి, దేవభక్తుని చక్రవర్తి తదితరులు

పెనమలూరు: కూటమి ప్రభుత్వంలో అన్యాయంగా వేధింపులకు గురవుతున్న కార్యకర్తలు, నాయకులకు అండగా వైఎస్సార్ సీపీ తీసుకొచ్చిన 'డిజిటల్ బుక్' పోస్టర్‌ను ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, పెనమలూరు, నందిగామ నియోజకవర్గాల పరిశీలకుడు అవుతు శ్రీనివాసరెడ్డి, పెనమలూరు ఇన్‌చార్జ్ దేవభక్తుని చక్రవర్తి మంగళవారం ఆవిష్కరించారు. కానూరులోని పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో అవుతు శ్రీనివాసారెడ్డి మాట్లాడుతూ పార్టీ నాయకులు, కార్యకర్తల కోసం వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి డిజిటల్ బుక్ ఏర్పాటు చేశారని తెలిపారు. వార్డు నుంచి నియోజకవర్గ స్థాయి వరకు నాయకులు, కార్యకర్తలు కూటమి ప్రభుత్వంలో ఎదుర్కొంటున్న సమస్యలను డిజిటల్ బుక్‌లో నమోదు చేయాలని సూచించారు. కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో అరాచక పాలన సాగిస్తోందని విమర్శించారు. వైఎస్సార్ సీపీ పెనమలూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ దేవభక్తుని చక్రవర్తి మాట్లాడుతూ కూటమి నేతలు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలను అన్యాయంగా వేధిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వారి వేధింపులను తిప్పికొడతామని, కార్యకర్తల కోసం పార్టీ ఎప్పుడూ అండగా నిలుస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు బాకీ బాబు, వైఎస్సార్ సీపీ నేతలు పి.రాఘవరావు, జంపాన ఏడుకొండలు, వేమూరి బాలకృష్ణ, కొత్తపల్లి వెంకటేశ్వరరావు, లింగాల శోభన్‌బాబు, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

లోకనాయకీ మనసాస్మరామి

విజయవాడ కల్చరల్: శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో శరన్నవరాత్రుల కార్యక్రమంలో భాగంగా పలు ప్రాంతాల నుంచి వచ్చిన కళాకారులు, సంగీత విద్వాంసులు నృత్యసేవలో అమ్మను తరిస్తూ, ధ్యానిస్తూ పులకించారు. మంగళవారం కార్యక్రమంలో సూరంపల్లికి చెందిన రత్నకుమారి బృందం లయబద్ధంగా తాళం భజన చేశారు. స్వరార్చన కార్యక్రమంలో భాగంగా వి.ఆశ్రిత, గుడిపాటి జయరాం సుధాకర్, హైదరాబాద్‌కు చెందిన మాధవీ కృష్ణ, రూప నాగతేజశ్విలు భక్తి గీతాలను ఆలపించారు. ఎం.భార్గవి, సీహెచ్ కృష్ణ ప్రియ, పి.శ్రీవల్లి, ప్రవల్లిక, బెంగుళూరుకు చెందిన సి.దివ్య, నెల్లూరుకు చెందిన జాహ్నవి, గోనుగుంట్ల శైలశ్రీ, ఎం.రజితాదేవి, ఎం.వెంకటేష్, భావన, యల్లాజోస్యుల అనురాధా, జి.విజయగౌరి, కర్నూలుకు చెందిన సాయిలిఖిత, ఎస్.దివ్య సరస్వతీ, రమాదేవిలు కూచిపూడి, భరతనాట్యాలను ప్రదర్శించారు. ఆర్.రామకృష్ణ కార్యక్రమాలను పర్యవేక్షించగా నిర్వాహకులు సైదా గంగాధర్ కళాకారులకు జ్ఞాపికలను అందజేశారు.

భవానీలకు అన్నప్రసాద వితరణ



కేసరపల్లిలో అన్నదానం చేస్తున్న రోటేరియన్లు

కేసరపల్లి(గన్నవరం): మండలంలోని కేసరపల్లి శ్రీఆంజనేయస్వామి ఆలయం వద్ద మంగళవారం రోటరీక్లబ్ ఆధ్వర్యంలో పుణ్య చారిటీస్ కార్యదర్శి జాస్తి విజయభూషణ్ కుమార్ సౌజన్యంలో భవానీ దీక్షాపరులకు అన్నప్రసాద వితరణ నిర్వహించారు. సుదూర ప్రాంతాల నుంచి పాదయాత్రగా వస్తున్న భవానీ భక్తులకు ఆహారం, తాగునీటితో పాటు విశ్రాంతి సదుపాయం కల్పించారు. రోటరీక్లబ్ అధ్యక్షుడు జీవీ రవిబాబు, కార్యదర్శి కే నాగరాజు, రోటేరియన్లు నర్రా సీతారామారావు, కొల్లి జగదీశ్వరరావు, జీ సురేష్‌బాబు పాల్గొన్నారు. అలాగే గన్నవరంలోని శ్రీభక్తాంజనేయస్వామి ఆలయ సమీపంలో పైడి పవన్‌కుమార్ ఆధ్వర్యంలో భవానీ దీక్షాపరులకు అల్పాహారం, మజ్జిగ పంపిణీ చేశారు.

కృష్ణానదికి వరద.. మునిగిన పంటలు



చోడవరంలో మునిగిన పసుపు పంట

పెనమలూరు: కృష్ణా నదికి వచ్చిన వరదలతో పలు పంటలు నీట మునిగాయి. విజయవాడ ప్రకాశం బ్యారేజ్ నుంచి దాదాపు 6.50 లక్షల క్యూసెక్కుల వరద నీరు దిగువకు వదిలారు. దీంతో నదిలో వరద పెరిగి కట్టపైకి నీరు చేరుకున్నాయి. కరకట్ట దిగువున మొక్కజొన్న, పసుపు, కంద, అరటి, చెరకు, వరి, కూరగాయల పంటలు సాగు జరుగుతున్నాయి. ప్రధానంగా పసుపు, కంద, వరి పంటలకు వరద నీరు చాలా ప్రమాదంగా మారింది. వరద నీరు వెంటనే తగ్గితే పంటలకు నష్టం ఉండని, నీరు కొద్దిరోజులు పొలాల్లో నిలిచిపోతే పంటలు దెబ్బతింటాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాగా నదికి వచ్చిన వరదతో కరకట్ట దిగువన ఉన్న నివాసితులు భయాందోళన చెందుతున్నారు.

ముమ్మరంగా రోడ్డు పనులు



యంత్రాలతో చేస్తున్న బీటీ రోడ్డు నిర్మాణం

గన్నవరం: స్థానిక గన్నవరం – ఆగిరిపల్లి ఆర్‌అండ్‌బీ రోడ్డు నిర్మాణ పనులను ఎట్టకేలకు వేగవంతం చేశారు. స్థానిక గాంధీబొమ్మ సెంటర్ నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు మంగళవారం బీటీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. సుమారు రూ. 1.50 కోట్లతో జాతీయ రహదారి నుంచి మార్కెట్ వరకు రోడ్డు విస్తరణ పనులను చేపట్టారు. ఇప్పటికే రోడ్డు విస్తరణకు అడ్డుగా ఉన్న దుకాణాలను, పలు విగ్రహాలను తొలగించారు. రోడ్డుకు ఇరువైపులా సీసీ డ్రెయిన్ల నిర్మాణం కూడా పూర్తిచేశారు. మొదటి ఫేజ్ కింద బీటీ రోడ్డు నిర్మాణం ప్రారంభించిన కాంట్రాక్ట్ సంస్థ మరో రెండు రోజుల్లో పూర్తి చేయనున్నారు. రెండవ దశలో అంబేడ్కర్ బొమ్మ నుంచి మార్కెట్ వరకు బీటీ రోడ్డు నిర్మాణం చేయనున్నట్లు పంచాయతీరాజ్ అధికారులు తెలిపారు. పెరిగిన వాహనాల రద్దీకి అనుగుణంగా రోడ్డును విస్తరించడంతో పాటు సెంట్రల్ లైటింగ్, ఫుట్‌పాత్‌లను ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు.

50 మంది రక్తదానం

పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీ పరిధి పోరంకి క్యాపిటల్ ఆస్పత్రిలో మంగళవారం నిర్వహించిన రక్తదాన శిబిరంలో 50 మంది దాతలు రక్తదానం చేశారు. ఎమ్మెల్యే బోడెప్రసాద్ రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు అనుమోలు ప్రభాకరరావు, వైద్యులు పాల్గొన్నారు.

అభయాంజనేయ సన్నిధిలో అన్నప్రసాద వితరణ

హనుమాన్‌జంక్షన్ రూరల్: స్థానిక ప్రసిద్ధ అభయాంజనేయస్వామి దేవస్థానంలో మంగళవారం స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి విచ్చేసి హనుమంతుడిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అభయాంజనేయునికి తమలపాకులతో ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయ ప్రాంగణంలో దాతలు కన్నిగంటి శ్రీనివాసరావు, మాధవి దంపతుల సహకారంతో భక్తులకు అన్నప్రసాద వితరణ నిర్వహించారు. ఆలయ పాలక మండలి చైర్మన్ వేమూరి శ్రీనివాసరావు, ఈఓ పితాని తారకేశ్వరరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

పెనమలూరు: అనారోగ్యంతో బాధపడుతున్న వారికి ఎమ్మెల్యే బోడెప్రసాద్ సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. పోరంకిలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ప్రసాద్ 72 మంది బాధితులకు రూ. 46.84 లక్షలు విలువైన చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతున్న వారికి వైద్య ఖర్చుల నిమిత్తం ప్రభుత్వం ఆర్థిక సాయం అందిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో కూటమి నేతలు, బాధితులు పాల్గొన్నారు.

వైభవంగా పుణ్యతిథి మహోత్సవాలు

మధురానగర్(విజయవాడ సెంట్రల్): విజయవాడలోని ముత్యాలంపాడు శ్రీషిర్డీ సాయిబాబా మందిరంలో సాయినాథుని 107వ పుణ్యతిథి మహోత్సవాలు మంగళవారం వైభవంగా జరిగాయి. మహోత్సవాల్లో భాగంగా బాబావారికి క్షీరం, గంధంతో విశేషంగా అభిషేకాలు నిర్వహించారు. లోక కల్యాణార్థం మందిర గౌరవాధ్యక్షుడు డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి దంపతులు వేదపండితుల మంత్రోచ్ఛారణల నడుమ సాయినాథ, ఆంజనేయ హోమం నిర్వహించారు. మందిర అధ్యక్షుడు లక్ష్మణరావు, కోశాధికారి సత్య శ్రీహరి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఇంద్రకీలాద్రిపై ఆధ్యాత్మిక శోభ

దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు ఇంద్రకీలాద్రిపై వైభవోపేతంగా సాగుతున్నాయి. దుర్గాష్టమి సందర్భంగా జగజ్జననీ.. అయిన లోకనాయకి మంగళవారం త్రిశూలం ధరించి అభయమిస్తూ సింహ వాహనంపై దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. చల్లగా చూడు తల్లీ.. మళ్లీ వస్తామంటూ భక్తులు అమ్మ ముందు ప్రణమిల్లారు. కళాకారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆద్యంతం అలరించాయి. సాయంత్రం నగరోత్సవం అట్టహాసంగా జరిగింది. ఉత్సవాలను చూడటానికి రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చిన భక్తులు కొండపై బారులు తీరారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ













వేద సంస్కృతిని పరిరక్షించుకోవాలి

విజయవాడ కల్చరల్: వేద సంస్కృతిని పరిరక్షించుకోవాలని విశ్వమాతా చారిటబుల్ సంస్థ వ్యవస్థాపకుడు నిడుమోలు రమా సత్యనారాయణ అన్నారు. చారిటబుల్ సంస్థ ఆధ్వర్యంలో సంస్థ కార్యాలయంలో మంగళవారం వీరుభట్ల ఫణికుమార్ నేతృత్వంలో వేద సభ, పండిత సత్కార కార్యక్రమాన్ని నిర్వహించారు. సభను ప్రారంభించిన రమా సత్యనారాయణ మాట్లాడుతూ.. వేదాలు భారతీయ ఆత్మగా అభివర్ణించారు. సర్వవేద సారం వేదాలలో నిక్షిప్తమై ఉన్నాయన్నారు. శాస్త్ర సాంకేతిక రంగాలకు చెందిన విషయాలు వేదంలో వివరించారని తెలిపారు. లోక శ్రేయస్సు కోసం 24 ఏళ్లుగా చండీ సప్తశతి యాగం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వేదపండితులు నాలుగు వేదాలను పారాయణం చేశారు. అనంతరం రమా సత్యనారాయణ దంపతులు పండితులను ఘనంగా సత్కరించారు.